క్లుప్తంగా

తహసీల్దార్‌గా సయ్యద్ సర్వర్



వాజేడు: వాజేడు తహసీల్దార్‌గా సయ్యద్ సర్వర్‌ను నియమిస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేసిన సయ్యద్ సర్వర్ ఈ నెల 14న కన్నాయిగూడెంకు డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏటూరునాగారంలో డీటీగా పని చేస్తున్న రాహుల్ చంద్రవర్మను వాజేడుకు బదిలీ చేసి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. తిరిగి సయ్యద్ సర్వర్‌ను తహసీల్దార్‌గా వాజేడుకు బదిలీ చేస్తు ఇన్‌చార్జ్‌గా ఉన్న రాహుల్ చంద్ర వర్మను డిప్యూటీ తహసీల్దార్‌గా కొనసాగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి

మంగపేట: మండలంలోని ప్రతీ గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రా కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాకాలం కావడంతో పాటు గత కొద్ది రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారినపడి సరైన వైద్యం అందక స్థానిక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. దోమెడలో చాలామంది జ్వరాల బారిపడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కోమటిపల్లి, తిమ్మంపేట, నర్సింహాసాగర్, పూరేడుపల్లి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం పేరుకుపోయి దోమలు తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. దీనిపై మండలంలోని మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు స్పందించి రోజుకో గ్రామంలో తప్పనిసరిగా వైద్య శిబిరం నిర్వహించాలని కోరారు.

కమిటీ ఎన్నిక



ఏటూరునాగారం: ఓడబలిజ సేవా సంఘం గ్రామ కమిటీ ఎన్నిక మంగళవారం మండల కేంద్రంలోని ఓడవాడలో నిర్వహించారు. అధ్యక్షులుగా గార పోషాలు, అంగాల వీరన్న, ఉపాధ్యక్షుడిగా సోమందపు నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా పానెం సాంబశివరావు, కోశాధికారి గార మహేష్ తదితర కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నరేష్, రాములు, కృష్ణ, రమేష్, హరికృష్ణ, తరుణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



వాజేడు: పేకాట రాయుళ్లను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అయ్యవారిపేట పల్లె ప్రకృతి వనంలో కొంత మంది పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో కొంత మంది పారిపోగా కుమ్మరి మోహన్ రావు, కుమ్మరి సమ్మయ్య, గొడిశాల రమేష్, కుమ్మరి శ్రీకాంత్, బెరుగు సాయి అనే ఐదుగురు పట్టు బడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9270తో పాటు 260 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టు బడిన ఐదుగురుపై కేసు నమోదు చేసి మిగతా వారి కోసం వెతుకుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి



మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ రవి

మంగపేట: మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతం వెంట గల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని వరద ముంపునకు గురయ్యే జనావాసాల ప్రజలను అప్రమత్తం చేయాలని మండల స్పెషలాఫీసర్, జిల్లా ఎస్సీకార్పోరేషన్ జిల్లా అధికారి తుల రవి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ అధ్యక్షతన గోదావరి వరదలపై మండల స్థాయి అధికారులు, 25 గ్రామపంచాయతీల కార్యదర్శులతో వరదలపై ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. రెండు రోజులగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పాటు గోదావరి ఎగువ ప్రాంతంలో నిర్మించిన ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసిన కారణంగా గోదావరి వరద పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గత ఏడాది వరదల తీవ్రత అంచనాతో ఎప్పటి కప్పుడు గోదావరి పెరుగుదల సమాచారాన్ని తెలుసుకుంటూ మండలంలోని గోదావరి వరద ముంపు గ్రామాల ప్రజలను ఆయా గ్రామాల అధికారులు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఉంటే గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేంత వరకు మండల హెడ్‌క్వార్టర్‌ను వదిలి వెల్లొద్దని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సూచించారు. అదే విదంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ఉండేందుకు దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎస్సై ఎస్‌కే తాహెర్‌బాబా, ఏఓ చేరాలు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ యాకన్న, పంచాయతీరాజ్ ఏఈ పాటి వాసుదేవరెడ్డి, ఇరిగేషన్ డీఈ రవికుమార్, మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి నరేష్, చుంచుపల్లిపీహెచ్‌సీ వైద్యాధికారి యమున, ఐసీడీఎస్ పీఓ హేమలత, ఈజీఎస్ ఏపీఓ చరణ్‌రాజ్, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, ఈజీఎస్ పీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పారిశుద్ధ్య పనులు అడ్డుకున్న కార్మికులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పంచాయతీ కార్మికులు మంగళవారం అడ్డుకున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం 13 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే తాత్కాలిక కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బందిని అడ్డుకున్నారు. పారిశుద్ధ్యం తరలిస్తున్న పంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుకొని తమకు న్యాయం జరిగే వరకు సమ్మెకు సహకరించాలని కోరారు. అధికారులు జోక్యం చేసుకొని తాత్కాలిక సిబ్బంది ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు.



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న పంచాయతీ కార్మికులు

రథయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 24న పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్, ఎస్సీ ఎస్టీయూ అధ్యక్షుడు జనగాం బాబురావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడమే ధ్యేయంగా, ఓపీఎస్ లక్ష్యంగా టీఎస్ సీపీఎస్ ఈయూ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరం రవికాంత్, ప్రధాన కార్యదర్శి మంకిడి రవి, ఉస్టీయూ ప్రధాన కార్యదర్శి శిరుప సతీష్, వినిత్, దిలీప్, శ్రీనివాస్, రమేష్, తిరుపతి, రవీందర్, సుమన్, కుమార్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎం కేసీఆర్‌పై కేసు హాస్యాస్పదం



వెంకటాపురం(కె): ఎమ్మెల్యే వీరయ్యపై ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వాజేడు: సీఎం కేసీఆర్‌పై భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య పోలీస్ స్టేషన్‌లో కేసుపెట్టడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెనుమళ్ల రామ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చెసి మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాలుగు సంవత్సరాల్లో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి చెప్పాలన్నారు. తట్టమట్టి కూడా పొయ్యని ఎమ్మెల్యే సీఎంపై కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఎల్లయ్య, వేణుగోపాల రావు, సాంబశివ రావు, సరబాబు, శ్రీను, కృష్ణ బాబు, కుమార్, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, అల్లి ప్రశాంత్, సాగర్ ఉన్నారు.

ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యం

వెంకటాపురం(కె) : భద్రాచలం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య అభివృద్ధి శూన్యం అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీతోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని అన్నారు. అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌పై ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు చేస్తు కేసులు పెడుతున్నాడని అన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్‌పై చేసిన తప్పుడు ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే వీరయ్య మండలంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల, అస్పత్రి ఆధునికరణ చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయలేదని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే వీరయ్య హామీలను అమలు చేయకుండా మోసం చేశారని పోలీస్టేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాయం రమణ, సర్పంచ్‌లు పూజారి ఆదిలక్ష్మి, పూనెం శ్రీదేవి, గంగా, సమ్మయ్య, మండల కార్యదర్శి పిళ్ళారి శెట్టి మురళి, నాయకులు వేల్పూరి లక్ష్మీనారాయణ, మద్దుకూరి ప్రసాద్, గాందర్ల నాగేశ్వ రావు, భిక్షపతి, తదితరులు ఉన్నారు.



వాజేడు: మాట్లాడుతున్న రామ కృష్ణారెడ్డి

అప్రమత్తంగా ఉండండి

వెంకటాపురం(కె)/వాజేడు: భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం(కె) సీఐ కాగితోజు శివప్రసాద్, వాజేడు ఎస్సై రేఖ అశోక్ తెలిపారు. మంగళవారం వారు వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు, వరద వస్తున్న సమయంలో ప్రజలు ఎవరు బయటకు రావద్దన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో ఇంట్లో ఉన్న విద్యుత్ మెయిన్ ఆపి బ్యాటరీతో నడిచే లైట్లను వాడాలన్నారు. జ్వరం, దగ్గు, జలుబు లాంటి వ్యాధులకు మందులను ముందుగానే తెచ్చుకుని ఇంట్లో ఉంచుకోవాలని సూచించారు. వారానికి సరి పడే నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రత్యేక మైన ఆహార పదార్థాలను తయారు చేసి పిల్లలకు పెట్టాలని సూచించారు. గోదావరికి వరద పెరుగున్న నేపథ్యంలో అందులోకి దిగవద్దని, చేపల వేటకు, ఈతకు వెళ్ల వద్దన్నారు. నీరు ప్రవహిస్తున్న సమయంలో రహదారిని దాటే ప్రయత్నం చేయకూడదన్నారు. బొగత, దుసపాటి లొద్ది జలపాతాల వద నీటిలో దిగొద్దన్నారు.

ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న దిశ ఫౌండేషన్ సభ్యులు

వెంకటాపురం(కె): చేయూత స్వచ్ఛంద సేవా సంస్థకు మంగళవారం దిశ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేశారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఎనిమిది వేల రూపాయల విలువ గల చెక్కును ఫౌండేషన్ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్‌కు దిశ వెల్ఫేర్ ప్రొటక్షన్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు పెనుమచ్చ మాధూరి చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో దిశ ప్రొటక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు వేల్పూరి సరిత, బట్టు పుష్పలత, గుర్రం సుభాషిని, పాయిని రజిత అనూష తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు



వాజేడు: దూలాపురంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు



ఏటూరునాగారం: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సుచరిత

వాజేడు: వర్షాకాలంలో ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్, మాతా శిశు సంరక్షణ వైద్యాధికారి క్రాంతి అన్నారు. మండల పరిధిలోని దూలాపురంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సదర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఎలాంటి అనారోగ్యం చెసినా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు. వైద్య శిబిరంలో కోటిరెడ్డి, శేఖర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి మధుకర్ క్షయ వ్యాధి గ్రస్తుడికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కోడిగుడ్లు, నూనె, బియ్యం, పప్పు, న్యూట్రీషియన్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, రజనీకాంత్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పప్కాపురంలో వైద్య శిబిరం

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ పీహెచ్‌సీ పరిధిలోని పప్కాపురం గ్రామంలో మంగళవారం డాక్టర్ సుచరిత వైద్య శిబిరాన్ని నిర్వహించి పరీక్షలు చేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ జైలుబాబు, ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలిపోయిన విద్యుత్ పరికరాలు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి సమ్మక్క ఆర్చీ ద్వారం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ డిస్క్ పేలిపోవడంతో నర్సింగాపూర్ గ్రామంలోని ఇళ్లలో విద్యుత్ పరికరాలు కలిపోయాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ట్రాన్స్‌ఫార్మర్ డిస్క్ పేలిపోవడంతో నర్సింగాపూర్ గ్రామంలోని ఇళ్లలోని కరెంట్ బల్బులు, ఫ్యాన్లు కాలిపోయాయి. కొంత మంది ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్, కంప్యూటర్లు కాలిపోయాయి. ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఇళ్లలో మీటర్ సర్వస్ వైర్లను కూడా సరి చేశారు. ఇళ్లలో ఎర్త్‌వైర్ తప్పని సరిగా పెట్టుకోవాలని, అనుకోకుండా ఈలాంటి విద్యుత్ ఘటనలు జరిగినప్పుడు ఎర్త్ కొంత మేరకు విద్యుత్ పరికరాలు కాలిపోయే అస్కారం ఉండదన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని మహ్మద్ గౌస్‌పల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్ మండలానికి చెందిన ముగ్గురు యువకులు మల్లంపల్లి నుంచి ఆత్మకూర్ వెళ్తున్న క్రమంలో హనుమకొండ నుంచి ములుగు వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు జాతీయ రహదారిపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్వి చక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్రగాయాలైయ్యాయి. గమనించిన స్థానికులు 108 కు సమాచారం అందించి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. రోడ్డు ప్రమాద విషయమై పోలీసులను సమాచారం కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఎస్ఎస్ తాడ్వాయి: మండలం కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని, గైర్హాజరైన వారిపై శాఖ పరమైన చర్యలకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్‌ముదిరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన దివంగత పార్టీ సీనియర్ నాయకుడు బుర్రి శంకర్ తండ్రి బుర్రి బానయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పార్టీ నాయకులతో కలిసి బొల్లు దేవేందర్ పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. గౌరవ మండల అధ్యక్షుడు జాలపు అనంత రెడ్డి, సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్, డైరెక్టర్ సిద్దరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాంబాబు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు భూషణబోయిన రవికుమార్, జిల్లా సీనియర్ నాయకులు తండాల శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ ఎనగంటి రామయ్య, రాజు, దుర్గయ్య, సమ్మయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్ గ్రామానికి చెందిన బీజేపీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు పులిచర్ల వెంకటేశ్వర్లు(45) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపుడి భాస్కర్‌రెడ్డి పరామర్శించి వెంటకేశ్వర్లు మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, మండల అధ్యక్షుడు లోడె శ్రీను,జినుకుల కృష్ణారావు, ఎండి యాకూబ్‌పాష, కోరెం నర్సింహులు, రామిడి సురేష్, గూడబోయిన సురేష్, సాంభయ్య, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు జయరాంరెడ్డి, మండల పార్టీ సంతాపం వ్యక్తం చేశారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

వాజేడు, పేరూరు ఎస్సైల బదిలీ

వాజేడు: మండల పరిధిలోని వాజేడు, పేరూరు ఎస్సైలు బదిలీ అయ్యారు. వాజేడు ఎస్సైగా పని చేస్తున్న రేఖ అశోక్‌ను మండల పరిధిలోని పేరూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. పేరూరు ఎస్సైగా విధులను నిర్వహిస్తున్న రుద్రారపు హరీష్‌ను ములుగు వీఆర్‌లో అటాచ్ చేసినట్లు సమాచారం. కాగా, ఎస్ ఎస్ తాడ్వాయి ఎస్సైగా పని చేస్తున్న సీహెచ్ వెంకటేశ్వర్‌రావును వాజేడుకు బదిలీ చేసినట్లు తెలిసింది.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



వెంకటాపురం(కె): సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు



మంగపేట: మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ముత్యాలు

వెంకటాపురం(కె): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 13 వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంజిత్, తాటి శ్రీను, బుచ్చిబాబు, లక్ష్మణరావు, సమ్మయ్య, నాగేశ్వరావు, అనూష ఉన్నారు.

మంగపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న జీపీ కార్మికుల నిరవదిక సమ్మే దీక్షలకు సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎల్సీ ముత్యాలు ఆధ్వర్యంలో బోరునర్సాపురం గ్రామస్తులు మంగళవారం దీక్షల్లో కూర్చుని సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ.. జీపీ కార్మాకులు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 13 రోజులగా సమ్మే చేస్తుండటంతో గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. పారిశుద్ధ్యం పేరుకుపోవడంతో వీధులన్ని అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. మండల అధ్యక్షుడు అదినారాయణ, జీపీ కార్మికుల సంఘం నాయకులు దశరథం, నర్సింహారావు, శ్రీనివాస్, రవి, ఆదినారాయణ, లక్ష్మయ్య, రామదాసు, మహేష్, వెంకటేశ్వర్లు, శ్రీను, రవి, రాజు, మాజిద్‌ఖాన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



కన్నాయిగూడెం: విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి చెందిన సంఘటన మండలంలో గుర్రేవులలో చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మటం సాంబశివరావుకు, మంచాల బుచ్చయ్యకు చెందిన రెండు గెదేలు మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో రాత్రి వర్షానికి తెగిపోయిన విద్యుత్ తీగలకు తగిలి షాక్ గురై మృతి చెందాయి. రెండింటి విలువ సూమరు రూ.లక్ష ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. విద్యుత్ అధికారుల అసమర్థత వలనే ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.